# బంగారు మనసు

ఎన్. శివనాగేశ్వరరావు

**"మా అమ్మాయని చెప్పడం కాదుగానీ, ఇందిర నిజంగా బంగారం!" అన్నాడు శ్రీపతి. పెండ్లిపెద్దలు ఆ మాటకు చిన్నగా నవ్వారు. పెళ్లికొడుకు రాజశేఖర్ మాత్రం ఆ మాటకు సవ్యంగా ప్రతిస్పందించాడు.**

ఫలహారం తీసుకున్న పది నిమిషాలకు ఇందిర ట్రేలో కాఫీ కప్పులుతెచ్చి అందరికీఅందించి ఎదురుగావున్న కుర్చీలోకూర్చుంది. కొద్దిపాటి అలంకరణతో చూడముచ్చటగా ఉన్న ఇందిరను చూడగానే రాజశేఖర్ కళ్లు మెరిసిపోలేదు. మనసు మాత్రం ఒక మధురమైన ఆత్మీయానుభూతికి గురయింది. ఆమెను తొలిసారి చూస్తున్నట్లు అనిపించలేదు. బాగా పరిచయమున్న మంచి స్నేహితురాలిలా కనిపించింది.

ఇందిరలో అతనికి నచ్చిన మరొక అంశం - ఆమె అందరిలా సిగ్గుపడుతూ తల దించుకోలేదు. అతనివంక చూసి స్నేహమయంగా నవ్వింది. ఆ నవ్వు శీతలపవనంలా అతని హృదయాన్ని తాకింది. రాజశేఖర్ కూడా ఆత్మీయంగా నవ్వాడు.

రాజశేఖర్ తల్లి పార్వతమ్మ "ఏమ్మా, ఏం చదివావు?" అని ప్రశ్నించింది.

"ఇంటర్ ప్రయివేట్‌గా పూర్తి చేశాను!" అని బదులిచ్చింది ఇందిర.

'ఆ అమ్మాయి మాట ఆమెలానే మృదువుగా ఉంది' అనుకున్నాడు రాజశేఖర్.

"వంటవచ్చా? అల్లికపనులు వచ్చా?" వంటి ప్రశ్నలు వేసింది పార్వతమ్మ.

ఇందిర స్పష్టంగా సమాధానాలు చెప్పింది.

"శేఖర్! అమ్మాయితో ఏమైనా మాట్లాడు!" అంది పార్వతమ్మ.

తను మాట్లాడవలసింది ఏం లేదన్నట్లు రాజశేఖర్ అడ్డంగా తల ఊపాడు. శేఖర్ చెల్లి మాలతి "మా అన్నయ్యతో మీరేమైనా మాట్లాడతారా?" అంది నవ్వుతూ.

"ఆ మాట నేనే అడగాలనుకున్నాను. మీరే అన్నారు. థాంక్యూ! మీ అన్నయ్యగారితో అయిదు నిముషాలు మాట్లాడాలి!" అంది ఇందిర.

ఆ మాట వినగానే పార్వతమ్మ ముఖంలో రంగులు మారాయి. అది గమనించిన రాజశేఖర్, తల్లి ఏదో అనబోతుండగా కనుసైగతో వారించి ఇందిరతో "చెప్పండి!" అన్నాడు.

ఇందిర పెద్దలవంక ఇబ్బందిగా చూసింది. అంతలో ఇందిర తల్లి, పార్వతమ్మతో "రండి, ఇల్లు చూద్దురుగాని!" అని ఆహ్వానించింది. పార్వతమ్మ, మాలతి అక్కడినుంచి లోనికి నడిచారు.

రాజశేఖర్ ఇందిరతో, "ఇప్పుడు చెప్పండి!" అన్నాడు. అతనికి ఆమె ఏం చెబుతుందో వినాలని ఆసక్తిగా ఉంది.

"మా ఫామిలీ మెంబర్సందర్నీ మీరు చూశారు. నాన్నగారికి నేను కాక మరో ఇద్దరు పెళ్లి కావలసిన అమ్మాయిలున్నారు. నాన్నగారు నాకోసం ఇంతకు ముందు ఐదారు సంబంధాలు చూశారు. మేమివ్వగలిగిన కట్నం నచ్చక వాళ్లు విరమించుకున్నారు. అది తెలిసి నాన్నగారు మనసు కష్టపెట్టుకున్నారు. అందుకనే శక్తికి మించిన కట్నం ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. ఆయన అప్పులవూబిలో చిక్కుకుపోవడం నాకెంతమాత్రం ఇష్టంలేదు. మీరు నన్ను చూశారు. మీకు నచ్చానో, లేదో తెలియదు. నచ్చినా, నచ్చకపోయినా నచ్చలేదనే చెప్పండి!" అంది ఇందిర.

అది విన్న రాజశేఖర్ భ్రుకుటి ముడిపడింది. ఇందిర తనతో సంభాషణకు ఉపక్రమించినప్పుడు తక్కువ కట్నంతో ఈ పెళ్లికి ఒప్పుకోమని ప్రాధేయపడుతుందనుకున్నాడు. కానీ తిరస్కరించమని చెప్పేసరికి ఆశ్చర్యపోయాడు.

"శక్తికి మించిన కట్నం ఇవ్వడానికి సిద్ధపడినా సంబంధం కుదరకపోతే ఆయన మరింత వ్యాకులపడతారేమో ఆలోచించారా?" అన్నాడు రాజశేఖర్.

"ఆలోచించాను. ఆయన ప్రస్తుతం ఉద్రేకంలో ఉన్నారు. మేమివ్వగలిగిన కట్నానికి తగిన వరుడు దొరికేవరకు ఓపిగ్గా నిరీక్షిద్దామని నాన్నగారికి నెమ్మదిగా నచ్చ చెప్తాను!" అంది ఇందిర.

"ఇబ్బందిపడకుండా మీవాళ్లు ఇవ్వగిలే కట్నం ఎంతో తెలుసుకోవచ్చా?" అడిగాడు రాజశేఖర్.

"పాతికవేలు ఇవ్వగలరు. నా ఒంటిమీద మూడుతులాల బంగారం ఉంది. ఇతర లాంఛనాలకు, పెళ్లిఖర్చులకు మరో పదివేలు ఖర్చుచేయగలరు!" అంది.

"ఇలా అడిగానని తక్కువ కట్నానికి నేనొప్పుకుండుటానని ఊహించకండి!" అన్నాడు రాజశేఖర్.

ఇందిర అతనివంక దెబ్బతిన్నట్లు చూసింది. "సారీ! నా కటువంటి ఆలోచన ఎంతమాత్రం లేదు. మీ ఉద్యోగానికి మంచి కట్నం వస్తుంది. మీకూ పెళ్లికావలసిన చెల్లెలు ఉంది. మీ ఖర్చులు మీకుంటాయి. ఎక్కువ కట్నం ఇచ్చుకోలేని నన్ను పెళ్లిచేసుకుని మీరు ఇబ్బందులపాలవ్వాలని నేనెలా కోరుకుంటాను?" అంది.

ఆమె హృదయం లోతు తెలుసుకోవడానికి తను అన్నమాట ఆమె మనసును గాయపరిచిందని తెలిసినా రాజశేఖర్ బాధపడలేదు. ఎందుకంటే అతని మనసు అప్పటికే ఒక నిర్ణయం తీసేసుకుంది.

అయిదు నిముషాలు ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది. అంతలో పార్వతమ్మ, మాలతి వచ్చారు. "అయిపోయాయమ్మా, మీ మాటలు!" అంది పార్వతమ్మ. ఆమె ఎంత దాచుకుందామన్నా మాటలో కొద్దిపాటి వ్యంగ్యం తొంగిచూసింది.

ఇందిర బదులుగా చిన్నగా నవ్వి లోనికినడిచింది.

"శేఖర్! అమ్మాయి నచ్చిందా!" అని అడిగింది పార్వతమ్మ. రాజశేఖర్ ఏమీ మాట్లాడలేదు.

అంతలో శ్రీపతి కల్పించుకుని, "నీ అభిప్రాయం చెప్పు, బాబూ!" అన్నాడు.

పార్వతమ్మ జోక్యం చేసుకుని, "అబ్బాయి అభిప్రాయం నేను తెలుసుకుంటాను. కట్న కానుకలు గురించి మాట్లాడండి!" అంది.

అందుకు శ్రీపతి, "అమ్మా! యాభై వేలు నగదు రూపేణా ఇస్తాను. అమ్మాయి ఒంటిమీద మూడుతులాల బంగారం వుంది. ఇతర లాంఛనాలకు, పెళ్లిఖర్చులకు మరో ఇరవైవేలు ఖర్చు చేస్తాను!" అన్నాడు.

అది విన్న పార్వతమ్మ పెదవి విరిచి, "మొన్నో సంబంధం చూశాము. లక్షరూపాయల కట్నం, పదితులాల బంగారం ఇస్తామన్నారు!" అంది.


"మేమంతకు తూగలేము" అన్నాడు శ్రీపతి.

రాజశేఖర్ కల్పించుకుని, "అమ్మా వాళ్లివ్వగలిగింది చెప్పారు. ఆలోచించి మన అభిప్రాయం రాద్దాం!" అన్నాడు. పార్వతమ్మ అంగీకారంగా తల ఊపింది.

వాళ్లు శ్రీపతిదగ్గర సెలవు తీసుకుని బయలుదేరిపోయారు.

"శేఖర్! మొన్న చూసిన అమ్మాయి కంటే ఈ అమ్మాయి కొంచెం అందంగా ఉంది. కానీ కట్నం మరీ తక్కువ. అన్నిటినీ బేరీజు వేస్తే ఆ సంబంధం చేసుకోవడమే నయం!" అంది పార్వతమ్మ రైలులో వెళ్లేటప్పుడు.

రాజశేఖర్‌కి ఇందిర జ్ఞాపకానికి వచ్చింది. ఆ అమ్మాయి చిరునవ్వు మదిలో మెదిలింది. ఇందిర



వారం వారం కథాప్రభ

మాటల్లోని నిజాయితీ నచ్చింది. తనవాళ్ళ అప్పుల పాలవకూడదన్న తపన, వాళ్ళిచ్చే తక్కువ కట్నానికి ఒప్పేసుకుని, భవిష్యత్తులో ఎదుటి వ్యక్తి ఇబ్బందులు పడకూడదన్న మంచిమనసు అతనికి నచ్చాయి.

ఇంతకుముందు చూసి సంబంధం అమ్మాయి కళ్లల్లోని నిర్లక్ష్యాన్ని, ఇందిర కళ్లల్లోని ఆత్మీయతను అతను బేరీజు వేసుకున్నాడు.

పదిరోజుల తర్వాత అతను, తల్లితో "అమ్మా! మనం పెళ్లిచూపులకు వెళ్లినప్పుడు శ్రీపతిగారు యాభైవేలు కట్నం ఇస్తామన్నారు కదా! నిజానికి ఆయన అది కూడా ఇచ్చుకోలేరు. అందుకు అప్పు

## గమనిక

**ఆంధ్రప్రభ** సచిత్ర వారపత్రికలో ప్రచురణకై పంపే రచనలు, కార్టూన్లు, ఫోటోలు తిరుగు పోస్టేజీ జత చేయకుండా, తరువాత కొంతకాలానికి పంపి, ఎంపిక కానివి తిప్పిపంపమని కొందరు కోరుతున్నారు. ఈవిధమైన రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదని మనవి. ప్రచురణకై పంపేవి అన్నీ కూడా తిరుగు పోస్టేజీ జత చేసి పంపాలి. పోస్టేజీ జత చేయనిపక్షంలో ప్రచురణ యోగ్యతలేనివి తిప్పి పంపే బాధ్యత వహించడం వీలుపడదు.

•

-ఎడిటర్

చేయాలి. వాళ్లమ్మాయి నాతో ఒంటరిగా మాట్లాడిన విషయం అదే!" అన్నాడు.

"మనకొద్దా ముష్టి సంబంధం!" అంది పార్వతమ్మ.

"కానీ ఆ అమ్మాయి నాకు నచ్చింది!" అన్నాడు శేఖర్.

"అందం చూసి మోజుపడి ఆ అమ్మాయిని చేసుకుంటే రేపు చెల్లిపెళ్లి ఎలా చేస్తావు?" అందామె రుసరుసలాడుతూ.

"అన్నీ ఆలోచించాను. చెల్లిపెళ్లికి మరొకరి డబ్బుతో పని లేదు. నేను చేయగలను. అందుకే ఇందిరను చేసుకుంటాను!" అన్నాడు శేఖర్ స్థిరంగా.

కొడుకు ఒకసారి నిర్ణయం తీసుకుంటే మరిక తిరుగుండదని ఆమెకు తెలుసు. అందుకే, "నీ ఇష్టం! కానీ ఒక్క విషయం మాత్రం మరచిపోకు. ఇందిరను పెళ్లాడి డబ్బు, బంగారం కాలదన్నుకుంటున్నావు. నీవేం నష్టపోతున్నావో భవిష్యత్తులో తెలుస్తుంది!" అంది. ఆ మాట అతని హృదయం మీద ముద్రించుకుపోయింది.

"మీ అమ్మాయి నచ్చింది. తను మీ తాహతు గురించి చెప్పింది. అందుకే మీరివ్వగలిగిన పాతికవేల కట్నానికే ఒప్పుకుంటున్నాం. పెళ్లిఖర్చులు, లాంఛనాలు మీ ఇష్టం. మంచిరోజు చూసి ముహూర్తాలు పెట్టుకుందాం!" రాజశేఖర్ దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం చదివిన శ్రీపతి ఆనందానికి అవధుల్లేవు.

ఇందిర అటువంటిది ఏ మాత్రం ఊహించలేదు. రాజశేఖర్ మంచి మనసుకు ఆమె ముగ్ధురాలయింది. అటువంటి మంచి భర్త దొరికినందుకు ఎంతో సంతోషించింది.

వాళ్లిద్దరి పెళ్లి సింపుల్‌గానే జరిగిపోయింది. ఇందిర, రాజశేఖర్‌తో అత్తవారింటికి బయలు దేరిపోయింది. పార్వతమ్మ కోడల్ని సాదరంగానే ఆహ్వానించింది. కొడుకు ఇష్టపడి చేసుకున్నప్పుడు తనెందుకు కోడలిదగ్గర చెడ్డ కావాలి అన్న ఆలోచనతో ఆమె కోడలుతో ప్రేమగానే మసలింది.

అయితే ఇందిరను చేసుకోవడానికి కొడుకు నిశ్చయించుకున్నప్పుడు 'డబ్బు, బంగారం కాలదన్నుకుని జీవితంలో నష్టపోతున్నావు' అన్న ఆమె మాట మాత్రం రాజశేఖర్ హృదయంలో చెరిగిపోలేదు. ఇందిరను చేసుకుని పొరపాటు చేయలేదు కదా అని ఆలోచించేవాడు. అయితే అది క్షణం మాత్రమే.

వారిద్దరి పెళ్లయిన నెల రోజుల తరువాత శ్రీధరం, రాజ శేఖర్ ఇంటికి వచ్చాడు. వారిద్దరూ కొలీగ్స్. అంతకుమించి మంచి స్నేహితులు. శ్రీధర్, ఇందిరతో "ఈ రోజు మా పాప పుట్టినరోజు. సాయంత్రం చిన్న పార్టీ ఉంది. మీరు తప్పక రావాలి!" అని ఆహ్వానించాడు.

శ్రీధరం వెళ్లాక, "ఇందూ! శ్రీధరం చాలా మంచివాడు. బాగా డబ్బున్నా అహం అన్నది లేదు. అందరికీ ఆఫీసులోనే ఆహ్వానం తెలియబరిచాడు. మనింటికే ప్రత్యేకంగా వచ్చి పిలిచాడు. సాయంత్రం వెళ్దాం!" అన్నాడు రాజశేఖర్.

ఇందిర, భర్తతో - "ఇటువంటి పార్టీలు నాకలవాటు లేదు. మీరు వెళ్లిరండి!" అంది.

"ప్రత్యేకంగా వచ్చి పిలిచినప్పుడు నీవు రాకపోతే బాగుండదు!" అని రాజశేఖర్ అనడంతో ఇందిర మరేం మాట్లాడలేకపోయింది.

సాయంత్రం భర్తతో శ్రీధరం ఇంటికి బయలుదేరింది. పాప కోసం గిఫ్ట్ కొని శ్రీధరం ఇంటికి వెళ్లారు. అప్పటికే చాలామంది ఆహూతులు వచ్చి ఉన్నారు. శ్రీధరం భార్య వసంత, ఇందిరను సాదరంగా ఆహ్వానించింది.

అప్పటికే అక్కడ చాలామంది ఆడవాళున్నారు. వారందరూ ఖరీదైన చీరలు, నగలతో చాలా స్టయిల్‌గా ఉన్నారు. వాళ్లల్లో ఎక్కువమంది రాజశేఖర్ కొలీగ్స్ భార్యలే. వసంత వారిని ఇందిరకు పరిచయం చేసింది.

రాజశేఖర్‌కి కొత్తగా పెళ్లయిన సంగతి అక్కడున్న వారందరికీ తెలుసు. వాళ్లందరూ అతనిభార్యను చూడాలని ఆసక్తిగా ఉన్నారు. ఇందిరను చూడగానే చుట్టుముట్టారు.

రాజశేఖరం తన కొలీగ్స్‌తో మాట్లాడుతున్నాడే కానీ మనసంతా ఇందిరవైపే ఉంది. రానంటే బలవంతంగా తెచ్చాడు. అందిమధ్య ఏం ఇబ్బంది పడుతోందోనన్న ఊహతో అతను అస్థిమితంగా ఉన్నాడు. అతనోకంట భార్యను గమనిస్తూనే ఉన్నాడు.

వైణిక అనే ఆవిడ ఇందిరతో "మీరేం చదివారు?" అని సంభాషణ మొదలుపెట్టింది. "ఇంటర్మీడియట్!" అని స్పష్టంగా చెప్పింది ఇందిర. "ఓ... స్...! అంతేనా? నేను డబుల్ ఎమ్మే!" అందామె.

"అలానా!" అన్నట్లు ఇందిర చిన్నగా నవ్వింది. అంతలో వైజయంతి అనే ఆవిడ "మీ పుట్టింటివాళ్లు ఎంత బంగారం పెట్టారు?" అని అడిగింది. "మూడుతులాలు!" అంది ఇందిర. "మావాళ్లయితే యాభై తులాలు పెట్టారు!' అందామె గర్వంగా.

అయితే ఆమె ఆశించినట్లు ఇందిర ముఖం చిన్నబోలేదు. అదే చిరునవ్వుతో ఉంది.

ఆ సంభాషణ అంతా రాజశేఖర్ చెవిన పడుతూనే ఉంది. తమ గొప్పతనం చాటుకోవడానికి ఎదటివారిని కించపరిచే వాళ్లమీద అతనికి అసహ్యం వేసింది.

పార్టీ అయ్యాక ఇల్లు చేరారు. 'సారీ ఇందిరా!' అన్నాడు రాజశేఖర్.

"ఎందుకు?" అంది ఇందిర.

"నీవు రానంటే బలవంతంగా తీసుకువెళ్లాను. నీ చదువుగురించి, బంగారంగురించి అడిగి వాళ్లు నిన్ను అవమానించారు!" అన్నాడు.

ఇందిర, భర్తకు చేరువుగా జరిగి, అతని భుజాల మీద చేతులు వేసి, "ఇందులో అవమానం ఏముంది? నేను ఇంటర్ వరకు చదివాను. ఆమె ఎవరో డబుల్‌ఎమ్మే అట. మా పరిస్థితులు వేరు, వారి స్థితిగతులు వేరు. అలాగే బంగారం విషయంలో కూడా ఎవరి స్తోమతను బట్టి వాళ్లు పెట్టుకుంటారు. వాళ్ల మాటలకు నేనేం బాధపడలేదు!" అంది.

"నలుగురి మధ్య ఒకర్ని తక్కువచేసి మాట్లాడటం తప్పు కదా!" అన్నాడు రాజశేఖర్,

"చదువు - సంస్కారాన్నీ, బంగారం - మంచి మనసునూ ఇవ్వవండీ!" అంది ఇందిర.

భార్య హృదయౌన్నత్యానికి అతను పులకితుడయ్యాడు. అదే క్షణాన 'బంగారం కాలదన్నుకుని ఇందిరను పెళ్లాడి నీవు జీవితంలో నష్టపోతున్నావు' అన్న తల్లి మాట జ్ఞప్తికి వచ్చింది. అతనా మాటను హృదయంమీదనుంచి చెరిపివేస్తూ...

'అంతకు మించిన విలువైన బంగారు మనసుంది ఇందిరకు' అనుకున్నాడు.

రాజశేఖర్ పూర్ణహృదయంతో భార్యను అపురూపంగా హృదయానికి హత్తుకున్నాడు.